
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జయశంకర్ భూపాలపల్లి 5 ములుగు

బుధవారం 20 మార్చి 2024



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.33 గం.

సహర్ : గురువారం ఉ : 4.58 గం.



ఉల్లంఘనకు చెక్

- ఎన్నికల కోడ్ అమలుకు పోలీసుల పటిష్ట చర్యలు
- డబ్బు, మద్యం రవాణాపై నిరంతర నిఘా
- భూపాలపల్లి జిల్లాలో ప్రత్యేక చెక్‌పోస్టులు
- విస్తృతంగా వాహనాల తనిఖీలు
- రంగంలోకి 10 ఫ్లయింగ్ స్క్వాడ్స్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 19: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కోడ్ అమల్లోకి వచ్చిన దృష్ట్యా ఎక్కడా ఉల్లంఘనకు తావులేకుండా పటిష్ట చర్యలకు పూనుకున్నారు. ముఖ్యంగా పోలీసు శాఖ అలర్ట్ అయ్యింది. మద్యం, డబ్బు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక కార్యాచరణతో ముందడుగు వేసింది. జిల్లాలో ఐదు చెక్ పోస్టులను పోలీసులు ఏర్పాటు చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గణేష్‌చౌక్‌లో ఒకటి, భూపాలపల్లి-పరకాల రహదారిలో రేగొండ మండలం చెన్నాపూర్ క్రాస్ వద్ద ఒకటి, మొగుళ్లపల్లి-జమ్మికుంట రహదారిలో మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని పెద్ద వాగు వంతెన వద్ద ఒకటి, కాళేశ్వరంలో అంతర్రాష్ట్ర రహదారిలో ఒక చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. మంథని- కాటారం రహదారి మల్హర్ మండలం నాగులమ్మ క్రాస్ వద్ద ఒక చెక్ పోస్టును ఏర్పాటు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

నిరంతర నజర్

చెక్‌పోస్టుల వద్ద పోలీసులు నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు. ఓటర్లను ప్రభావితం చేసే డబ్బు, మద్యం రవాణాకు అడ్డకట్ట వేయడమే లక్ష్యంగా కసరత్తు చేస్తున్నారు. చెక్‌పోస్టుల మీదుగా రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వీరితో పాటు 10 ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు కూడా ఇప్పటికే రంగంలోకి దిగాయి. ప్రతి మూడు మండలాలకు ఒక ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిసింది. ఒక్కో బృందంలో ఐదుగురు ఉంటారు. ఎక్కడా ఎలాంటి అనుమానాలు ఉన్నా, ఏదైనా సమాచారం అందుకున్నా వెంటనే వీరు తనిఖీ చేస్తారు.

నగదుతో తారసపడితే..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో నగదు రవాణా విషయంలో నిబంధనలు కఠినంగా ఉన్నాయి. తమ వెంట రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లేందుకు వీల్లేదు. ఎక్కువ డబ్బులతో పోలీసులకు తారసపడితే ఆధారాలు తప్పక చూపాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఆ డబ్బు రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించినవిగా తేలితే మాత్రం వెంటనే సీజ్ చేసి కేసు నమోదు చేస్తారు. ఆస్పత్రి అవసరాలు, వ్యవసాయ, వ్యాపార సంబంధిత డబ్బుగా ఆధారాలు చూపితే ఆ వ్యక్తులకు వెంటనే తిరిగి అప్పజెబుతారు.

కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద వాహనాలు తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్సై భవానిసేన

అనుమతులు తప్పనిసరి

ఎన్నికల సందర్భంగా నిర్వహించే ర్యాలీలు, సభలు, సమావేశాలకు పోలీసు శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే కేసులు నమోదు చేస్తారు. లౌడ్ స్పీకర్లు, ప్రచారం కోసం విని యోగించే వాహనాలకు సైతం పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే ప్రచారానికి అనుమతి విధించారు.



భూపాలపల్లి గణేష్‌చౌక్‌లో ఏర్పాటుచేసిన చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

దీన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటారు.

అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా నగదు పట్టివేత

డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భారీగానే డబ్బు, మద్యం పట్టుబడింది. చెక్‌పోస్టుల వద్ద, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తనిఖీల్లో రూ.38,80,773 నగదు, రూ. 31,90,737 విలువ గల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం మద్యం, డబ్బును కట్టడి చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నారు.

విస్తృత తనిఖీలు చేపడుతున్నాం..

- కిరణ్ ఖరే, భూపాలపల్లి ఎస్పీ



పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఉల్లంఘనలకు అడ్డుకునేందుకు విస్తృత తనిఖీలు చేపడుతున్నాం. ప్రధానంగా మద్యం, నగదుపై నిఘా పెట్టాం. ఇందుకు జిల్లాలో అవసరమైన ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. 24 గంటలపాటు గట్టి నిఘా పెట్టాం. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజలు ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణించొద్దు. శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలి.

కోటంచ బ్రహ్మోత్సవాల ప్రారంభం



సూర్యవాహనంపై లక్ష్మీనరసింహస్వామి

రేగొండ, మార్చి 19: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారిని సూర్యవాహనంలో మాడవీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంలో డప్పు చప్పుళ్ల మధ్య భక్తుల గోవిందనామస్మరణతో స్వామివారిని ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, జాతర కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, డైరెక్టర్లు సబ్బిడి సమ్మిరెడ్డి, మూల ఓంకార్, కోటేశ్వరరావు, శ్రీధర్, పొలుసాని శ్రీనివాసరావు, సదరం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



ములుగులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు కలెక్టరేట్, మార్చి 19: జిల్లా కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్ అనుమతి లేదన్నారు. తాగునీరు, కనీస మౌలిక సౌకర్యాల ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద వైద్యశిబిరం ఏర్పాటుచేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన 21 పరీక్ష కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మొత్తం 3,088 మంది విద్యార్థులకు 3,081 మంది హాజరయ్యారని, ఏడుగురు గైర్హాజర్ అయినట్లు తెలిపారు. 21మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 21మంది శాఖ అధికారులు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్లు, 200మంది ఇన్విజిలేటర్లను నియమించామని వివరించారు. ఆమె వెంట ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణ అధికారి అప్పని జయదేవ్, చీఫ్ సూపరింటెండెంట్ తిరుపతి, డీవో రవీందర్ తదితరులు ఉన్నారు.

ఫోన్‌ట్యాపింగ్ ప్రకంపనలు

ప్రణీత్‌రావు సొంత జిల్లా వరంగల్‌పై దృష్టిసారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం

వార్‌రూం ఏర్పాటు చేసింది పర్వతగిరిలోనేనని ప్రచారం

వరంగల్‌లో ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకున్నట్టు చర్చ

వ్యవహారంలో వరంగల్ నేతలున్నారంటూ అభియోగాలు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్రంలోనే సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం జిల్లాలోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. కీలకమలుపులు తిరుగుతున్న ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ వైపు దృష్టిమళ్లించారు. వరంగల్ జిల్లా పర్వతగిరిలోని ఓ వ్యక్తి ఇంట్లో వార్‌రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ ట్యాపింగ్ చేశారనే ప్రచారం నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామునే వరంగల్‌లో పని చేస్తున్న ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే స్పెషల్ ఇంటిలిజెన్సీ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఇచ్చిన సమాచారం మేరకే ఇద్దరు సీఐలను అదుపులో తీసుకున్నట్టు తెలిసింది. అయితే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారి అయిన ప్రణీత్‌రావు సొంత ఊరు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడిపల్లి కావటం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రణీత్‌రావు స్వగ్రామం మేడిపల్లి అయితే తన అమ్మమ్మ, అత్తగారి ఊరు పర్వతగిరి మండలం కేంద్రం. బాల్యం మొత్తం మేడిపల్లిలోనే గడిచినా ఆయనకు పర్వతగిరితోనే ఎక్కువ సత్సంబంధాలున్నాయని స్థానికులు పేర్కొంటునానరు. ఎస్ఐగా పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరిన ప్రణీత్‌కు సాంకేతిక విద్యపై పూర్తిస్థాయిలో ఉన్న పట్టుతో స్పెషల్‌బ్రాంచ్‌లో పనిచేసి త్వరితగతిన పదోన్నతులు పొందినట్లుగా సమాచారం. అయితే ప్రణీత్‌రావు అత్తింటివారు, సంబంధీకులు మొత్తం చాలాఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

పర్వతగిరిలో వార్‌రూమ్?

గత ప్రభుత్వం హయంలో నాటి పీసీసీ నేత రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కీలక నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లుగా ఆరోపణలున్న కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును ఇటీవల హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన్ను విచారించిన పోలీసులు ఏఏ జిల్లాల్లో.. ఎక్కడెక్కడ వార్ రూమ్‌లు ఏర్పాటు చేశారని, సహకరించిన ఇన్‌స్పెక్టర్ల జాబితా, ధ్వంసం చేసిన కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌ల వివరాలను రాబట్టినట్టు సమాచారం. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా పర్వతగిరిలో కూడా వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు ప్రణీత్‌రావు చెప్పినట్టు సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలో ఆయనిచ్చిన సమాచారంతో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించి విచారిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పర్వతగిరిలో వార్ రూమ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఓ సీఐ నేతృత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని తెలియరాగా.. ఈ వ్యవహారమంతా ఎలా జరిగిందనే కోణంలో విచారణ నిర్వహిస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్ నేతలతో పాటు కొందరు బీఆర్ఎస్ నేతలు, కీలక అధికారుల ఫోన్‌లు ట్యాప్ చేశారని, ఈ మొత్తం వ్యవహారంలో జిల్లాకు చెందిన ఓ నేత కూడా ఉన్నారని ప్రచారం జరగడం, దర్యాప్తు బృందాలు వరంగల్‌పై నిఘా పెట్టడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రణీత్‌రావు ఎవరో తెలియదని ఎర్రబెల్లి స్పష్టీకరణ

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతుండటం, సోషల్‌మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతుండటంపై ఆయన స్పందించారు. తనకు ప్రణీత్‌రావు ఎవరో తనకు తెలియదని మంగళవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. పర్వతగిరిలో ప్రణీత్‌రావుకు బంధువులు ఉండటం మూలంగా వచ్చి పోయేవాడని, తనను కొందరు కావాలనే ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తానెవరికీ భయపడేది లేదని, తన పేరు చెప్పాలని ప్రణీత్‌రావుపై ఒత్తిడి తెస్తున్నారని ఎర్రబెల్లి ఆరోపించడం మరింత చర్చకు దారితీసింది.

సరిహద్దుల్లో అలజడి

- మహారాష్ట్ర రేపనపల్లి అడవుల్లో ఎదురుకాల్పులు
- నలుగురు మావోయిస్టుల మృతి
- సుమారు రెండున్నర గంటలపాటు తుపాకీ చప్పుళ్ల మోత

7లో



కొలమార్క గుట్టల నుంచి మావోయిస్టు మృతదేహాన్ని హెలీక్యాప్టర్‌లో గడ్చిరోలికి తీసుకొచ్చిన పోలీసులు

చిన్న కాళేశ్వరం పనులు పూర్తి చేయాలి

అధికారులతో కలెక్టర్ భవేష్ మిశ్రా

మహదేవపూర్, మార్చి 19: జిల్లాలోని నాలుగు మండలాల్లోని 45 వేల ఎకరాలకు సాగునీటిని అందించే చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మండలంలోని బీరసాగర్ వద్ద ఉన్న ఫేజ్ -1 పంప్‌హౌస్ మరమ్మతు పనులను ఆయన మంగళవారం సాయంత్రం పరిశీలించారు. మూడు మోటార్లకు మరమ్మతులు పూర్తయితే ఎర్రచెరువు, మందర చెరువులకు సాగునీటి సరఫరా ఉంటుందన్నారు. ప్రస్తుతం 65 శాతం పనులు పూర్తయ్యాయని 35 శాతం పూర్తి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమావేశమై పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు యాదరి, తిరుపతిరావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

అదనపు కలెక్టర్ ఇంట్లో చోరీ



ఏటూరునాగారం రూరల్, మార్చి 19: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కేంద్రంలో ఉన్న హైదరాబాద్ అదనపు కలెక్టర్ నూతి మధుసూదన్ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న మధుసూదన్ స్వగ్రామం ఏటూరునాగారం. ఆయనకు ఇక్కడ ఇల్లు ఉండగా సెలవుల్లో వచ్చి వెళ్తుంటారు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చోరీకి పాల్పడ్డారు. చుట్టుపక్కలవారు గమనించి మధుసూదన్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రాజు, ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఫోరెన్సిక్ అధికారులు ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆగంతకుల వేలిముద్రలను సేకరించారు. దీంతోపాటు ఇంట్లో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించారు. ఏయే వస్తువులు చోరీకి గురయ్యాయోననే వివరాలను విచారణ అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.


అదనపు కలెక్టర్ ఇంట్లో వివరాలు సేకరిస్తున్న సీఐ, ఎస్సై

బీఆర్ఎస్‌లోనే ఉంటా...

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 19: బీఆర్ఎస్‌ను ఎట్టి పరిస్థితిలోనూ వీడిది లేదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. 'గండ్ర దారెటు..?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవస్తూ బీఆర్ఎస్‌లోనే ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్ నుంచి తాను బయటకు వెళ్తాననేది అవాస్తవమని పేర్కొన్నారు. నిత్యం కార్యకర్తలతోనే ఉంటూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు అలుపెరగక పనిచేస్తానని తెలిపారు. ప్రతిపక్ష పాత్రను సమర్థంగా పోషిస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలెవరూ అయోమయం చెందొద్దని కోరారు.

రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా సారంగపాణి



వెంకటాపూర్(రామప్ప), మార్చి 19: తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన వడ్డేపల్లి సారంగపాణి ఎన్నికయ్యారు. హైదరాబాద్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సారంగపాణి మాట్లాడుత రజకుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతానన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, ప్రభుత్వరంగ సంస్థల్లో జీవో 102ను అమలు చేయాలని, రజక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసి జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు. ఉప్పల్ భగయత్ ప్రాంతంలో రజకుల ఆత్మగౌరవ భవనానికి మూడెకరాల స్థలం కేటాయించి భవన నిర్మాణానికి రూ.10కోట్ల విడుదల చేయాలని, ఇనాం భూములకు పట్టాలందించాలని, 50ఏళ్ల నిండిన రజకులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

రుణసాయానికి దూరం..

- వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ పథకానికి నోచుకోని రైతులు
- అవగాహన లేకపోవడమే కారణం
- గోదాముల్లో పంటను నిల్వ చేసుకుంటే 'రైతుబంధు'
- రీజియన్ పరిధిలో రూ.28కోట్లు కేటాయింపు..
- రుణం తీసుకుంది మాత్రం నలుగురే..

వరంగల్ వ్యవసాయం, మార్చి 19 : వ్యవసాయ మార్కెట్లలో పంటలకు గిట్టుబాటు ధర లభించనప్పుడు ఆ పంటను గోదాముల్లో నిల్వ చేసుకుని, దానిపై సదరు రైతులు రుణం పొందేందుకు వీలుగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుబంధు (రుణసాయం) పథకాన్ని 20ఏళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ మార్కెట్లలో రైతుల నుంచి పన్ను వసూలు చేయడమే కాదు.. రైతులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం రైతుబంధు పేరుతో రైతులకు రుణం ఇచ్చి ఆసరా గా నిలిచే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేపెట్టిది. పంటను అమ్మకానికి తీసుకువచ్చినప్పుడు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోతే.. ఆ సమయంలో ఆ రైతు సరుకును మార్కెట్ కమిటీ గోదా ముల్లో లేదంటే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుని ఆ రశీదును మార్కెట్ కమిటీలో అందజేసే, అధికారులు సదరు రైతు పంట సరుకు విలువలో 75శాతం, లేదా రూ.2లక్షలకు మించకుండా ఆరు నెలల వరకు వడ్డీలేని రుణాన్ని రైతుకు అందజేస్తారు. ఆ తరువాత రైతు పంటను మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించి తీసుకున్న రుణాన్ని మినహా యించుకుని మిగతా డబ్బులు రైతుకు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటారు.

కేటాయించింది రూ.28కోట్లు..

ఇచ్చింది రూ.7.71లక్షలే..

మార్కెట్ రీజినల్ పరిధిలో 19 జిల్లాలు, 110 మార్కెట్ కమిటీలకు 2023-24 సంవత్సరానికి గాను రైతుబంధు పథకం కింద మార్కెటింగ్‌శాఖ రూ.28కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు వరంగల్ జిల్లాలో ఒక రైతుకు రూ.2లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో ఒక రైతుకు రూ. 1.75లక్షలు, ఖమ్మం జిల్లాలో ఇద్దరు రైతులకు రూ.4లక్షలు కలిపి రైతుబంధు పథకం నలుగురు రైతులకు రూ.7.71లక్షలు మాత్రమే ఇచ్చారు. అయితే ఈ రైతుబంధు పథకంపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో పథకం నిర్వీర్యమవుతోంది. అధికారులు సైతం కల్పించడానికి ఆసక్తి చూపడం లేదు. రైతులకు అవగాహన కల్పిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మంచి ధర వచ్చే వరకు సరుకునే దాచుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అసలే ఉద్యోగుల కొరతతో ఉన్న అధికారులకు ఇప్పటికే పని ఒత్తిడికి లోనవుతున్న క్రమంలో రైతుకు మంచి అవకాశాల గురించి చెప్పే ఓపిక లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రైతులకు సేవలందిస్తున్నాం..

- మల్లేశం, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్

రైతుబంధు (రుణసాయం) పథకం కింద రైతులకు సేవలందిస్తున్నాం. ఈ సంవత్సరం ధాన్యం, మొక్కజొన్న, ఇతర ఉత్పత్తులకు ఎంఎస్‌పీ ధరల కంటే మార్కెట్లో ఎక్కువ ధరలు పలుకడంతో రైతులు రైతుబంధు పథకాన్ని వినియోగించుకో లేదు. సాధారణంగా రైతులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో రైతుబంధు పథకం ద్వారా రుణం తీసుకుంటారు. ముఖ్యంగా మార్చిలో రైతులు రుణం తీసుకుంటుంటారు. రైతుబంధుపై మార్కెట్లో రైతులకు తెలిసేలా మైక్‌ల ద్వారా అనౌన్స్ చేయిస్తున్నాం.

పులిపిర్లకి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, మార్చి 19: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 20, 21, 22, తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. బుధ, గురు, శుక్ర వారం మూడు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.

న్యాక్ జాతీయ సదస్సులో వీసీ రమేశ్



న్యాక్ జాతీయ సదస్సులో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఇతర అధికారులు

కేయూ క్యాంపస్, మార్చి 19: విద్యాసంస్థల స్వయం సమృద్ధితో విద్యా విధానాల్లో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలపై మంగళవారం దేశ వ్యాప్తంగా బెంగళూరలోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్ నుంచి సదస్సులో పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల కోసం న్యాక్ అధికారులు దేశంలోని వివిధ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్లు, జాతీయ సంస్థల డైరెక్టర్లు, అటానమస్ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో న్యాక్ అక్రిడేషన్ విధానం, ప్రస్తుతం ఉన్న విధానంలో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలు, అక్రిడేషన్ పొందిన విద్యాసంస్థలకు వచ్చే ప్రయోజనాలతోపాటు విద్యార్థులకు కల్పించాల్సిన, సమాజానికి అవసరమైన విద్యాసంస్థల స్వయం సమృద్ధి కోసం చేయాల్సిన బాధ్యతలు చర్చించారు. డిజిటలీకరణ, అకడమిక్ క్రెడిట్స్, ఫిర్యాదుల పరిష్కారం యంత్రాంగం, అభిప్రాయ సేకరణ, విద్యాసంస్థల్లో ఉన్న ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ పనితీరుపై చర్చించారు. జాతీయ విద్యావిధానంలో పొందుపరిచిన లక్ష్యాలను అందుకునేందుకు దృష్టి పెట్టాల్సిన అంశాలనూ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, కేయూ క్వాలిటీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, ప్రొఫెసర్ ఎన్.గోపి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నిట్ విద్యార్థి దుర్మరణం


క్షితిజ్ రాజ్ (ఫైల్)

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: అతి వేగం ఓ టెక్నోక్రాట్‌ను బలితీసుకుంది. కారును అతి వేగంగా నడపడం వల్ల సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని తార్నాక వైజంక్షన్‌లో డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో వరంగల్ నిట్ విద్యార్థి క్షితిజ్‌రాజ్(22) దుర్మరణం పాలయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన క్షితిజ్‌రాజ్ నిట్‌లో ఈఈఈ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఈ ఘటనలో మరో నలుగురు నిట్ విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వివరాల్లోకి వెళితే.. స్నేహితుడి ఇంటర్వ్యూ కోసం సోమవారం వరంగల్ నుంచి సెల్ఫ్ డ్రైవింగ్ కార్‌ను అద్దెకు తీసుకొని క్షితిజ్‌రాజ్, ఈసీఈ నాలుగో సంవత్సరం విద్యార్థి హర్షిత్ మహేశ్వరి, ఈఈఈ నాలుగో సంవత్సరం విద్యార్థి అర్జునస్వర్, ఎంఎంఈ నాలుగో సంవత్సరం విద్యార్థి నవీన్ దవన్, ఎం ఎంఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కపిల్ హైదరాబాద్ వెళ్లారు. తార్నాక సమీపంలోని పీఎస్ వై జంక్షన్ సమీపంలో రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో అతివేగంగా నడుపుతున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో క్షితిజ్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మిగతా నలుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తార్నాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిట్ విద్యార్థి రోడ్డు ప్రమాదంతో దుర్మరణం పాలవడంతో నిట్‌లో ఒక్క సారిగా విషాదఛాయలు అలముకొన్నాయి.

సరిహద్దుల్లో అలజడి

మహారాష్ట్ర రేపనపల్లి అడవుల్లో ఎదురుకాల్పులు ● నలుగురు మావోయిస్టుల మృతి



కొలమార్క గుట్టల నుంచి మావోయిస్టు మృతదేహాన్ని హెలీక్యాప్టర్‌లో గడ్చిరోలికి తీసుకొచ్చిన పోలీసులు

మహదేవపూర్, మార్చి 19: పార్లమెంటు ఎన్నికల వేళ తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో మంగళవారం తెల్లవారుజామున అలజడి రేగింది. సుమారు రెండున్నర గంటలపాటు పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన హోరాహోరీ ఎదురుకాల్పుల్లో తెలంగాణకు చెందిన నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. గడ్చిరోలి జిల్లా రేపనపల్లికి సౌత్ ఈస్ట్ ప్రాంతంలో 8 కిలోమీటర్ల దూరంలోని కొలమార్క గుట్టల్లో ఈ ఘటన జరిగింది. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో మావోయిస్టుల కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతుందన్న పక్కా సమాచారంతో అహెరీ అదనపు ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో పెద్దఎత్తున పోలీసు బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. తెల్లవారుజామున ఒక డెన్‌లో ఉన్న మావోయిస్టులను చుట్టుముట్టిన పోలీసులు కాల్పులు ప్రారంభించగా మావోయిస్టులు ఎదురుకాల్పులకు దిగడంతో సుమారు రెండున్నర గంటల పాటు కొలమార్క గుట్టల ప్రాంతంలో తుపాకీ చప్పుళ్లతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. కాల్పులు ముగిసిన తర్వాత పోలీసులు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా ఈ ఘటనలో తెలంగాణలోని మంగీ- ఇంద్రవెల్లి ఏరియా కమిటీ సభ్యుడు, కొమురంభీం మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన వర్గీస్(28), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భైరాన్‌ఘర్ జిల్లా కొత్రాంకు చెందిన జిల్లా కమిటీ సభ్యుడు, సిర్పూర్ - చెన్నూరు కార్యదర్శి పాండు అలియాస్ మంగులు (32), ప్లాటూన్ మెంబర్లు కురుసంగి రాజు , కుడిమేత వెంకటేశ్ మరణించినట్టు గుర్తించారు. సంఘటనా స్థలంలో ఏకే 47 రైఫిల్ ఒకటి, ఒక కార్బన్, మరొక కంట్రీమేడ్ పిస్టల్, మావోయిస్టుల సాహిత్యం, పేలుడు పదార్థాలు, వంట సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరిగిన సంఘటనా స్థలం నుంచి మరికొంతమంది మావోయిస్టులు తప్పించుకొని వెళ్లారని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఈ నలుగురిపై మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం రూ. 36లక్షల రివార్డును ప్రకటించడం విశేషం. ఇక తప్పించుకున్న మావోయిస్టులు ఏయే ప్రాంతాలవైపు వెళ్లే అవకాశం ఉందన్న పక్కా ప్రణాళికలతో పోలీసులు సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. కొలమార్క గుట్టలతో పాటు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిఘా వ్యవస్థను పటిష్టపరిచి తప్పించుకున్న మావోయిస్టులను మట్టుబెట్టడమే లక్ష్యంగా పోలీసులు కూంబింగ్ చేస్తున్నారు.

టెన్షన్.. టెన్షన్..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన 72 గంటల్లోపే మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల కట్టడికి కూంబింగ్ చేపట్టారు. అలాగే రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎదురుకాల్పుల్లో గాయపడిన మావోయిస్టులు చికిత్స కోసం తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో గోదావరి తీర ప్రాంతం వెంట పటిష్ఠ భద్రతను అప్రమత్తం చేసినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇక తాజా ఘటనలో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఐజీ సందీప్ పాటిల్, గడ్చిరోలి జోన్ డీఐజీ అంకిత్ గోయల్, సీఆర్‌పీఎఫ్ డీఐజీ జగదీష్ మీనా, గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్‌లను ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న వారి ఉన్నతాధికారులు ప్రశంసించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

అంతర్రాష్ట్ర వంతెనపై పోలీసుల తనిఖీలు

మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో అప్రమత్తమైన కాళేశ్వరం పోలీసులు అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోకి వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. గోదావరి మీదుగా మావోయిస్టులు తెలంగాణాలోకి వచ్చే అవకాశం ఉండడంతో గ్రామస్థులకు అవగాహన కల్పించి.. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే సమాచారం అందించాలని సూచిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను మహదేవ పూర్ సిఐ రాజేశ్వర్‌రావు, కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ పర్యవేక్షిస్తున్నారు.

ఉద్యమకారులతో బీఆర్ఎస్ నేతల చర్చలు

- కడియం కావ్యను మార్చాలని ఉద్యమకారుల డిమాండ్
- అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామన్న నేతలు
- లేదంటే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిక

రాంనగర్, మార్చి19: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులతో బీఆర్ఎస్ నేతలు దాస్యం వినయ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, సుందర్ రాజ్ భేటీ అయ్యారు. మంగళవారం నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో భేటీ అయిన నేతలు.. నిరసన గళం వినిపిస్తున్న ఉద్యమకారులు బోడ డిన్నా, జోరిక రమేశ్, బండి రజనీకుమార్, వీరేందర్, చింతల యాదగిరితో చర్చలు జరిపారు. పార్టీలో సభ్యత్వంలేని, రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని కడియం కావ్యను ఎలా అభ్యర్థిగా ప్రకటిస్తారని ఉద్యమకారులు ప్రశ్నించారు. తమలో ఒకరికి అవకా శం ఇవ్వాలని చేస్తున్న అభ్యర్థనను ఏ మాత్రం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమం జసమని వారు నేతలను ప్రశ్నించారు. ఒకే ఇంట్లో నుంచి ఇద్దరికి పదవులు ఇవ్వాల్సిన అవసరం ఏంటని వారు నేతల దృష్టికి తీసుకువచ్చారు. వారంరోజుల్లో కడియం కావ్యను మార్చి తమలో ఎవరికైనా అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమ అభ్యర్థనను పార్టీ అధిష్ఠానం పట్టించుకోకుంటే జయశంకర్ విగ్రహం వద్ద ప్రెస్‌మీట్ పెట్టి కార్యాచరణ ప్రకటిస్తామని నేతలకు తేల్చిచెప్పారు. కాగా, ఉద్యమకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామని నేతలు పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. అధిష్ఠానం సూచించిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని నేతలు పేర్కొన్నారు.

క్రషర్స్ యజమానులకు సమస్యలు పరిష్కరించాలి



డీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి19: మైనింగ్ శాఖ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లును కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న డీడీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్టోన్ క్రషర్స్ యజమానులకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డీడీ వెంకటేశ్వర్లును కోరారు. అనంతరం మైనింగ్ శాఖ హనుమకొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సాంబశివరావును కలిశారు. కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుల పేరాల మధుసూధన్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.నరేష్, స్టోన్ క్రషర్స్ యజమానులు దేవేందర్ రెడ్డి, రాంరెడ్డి, సుజిత్‌రావు తదితరులు డీడీని కలిసిన వారిలో ఉన్నారు.

నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: విదేశాల్లో ఎంఎస్, పీహెచ్‌డీ కోర్సులు చదివేందుకు నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత విభాగం ప్రకటన జారీ చేసింది. 2024-25 సంవత్సరానికి ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. www.nosmsje.gov.in అనే వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వారు పేర్కొన్నారు.

చేసిన తప్పును ప్రజలు ప్రజలు గుర్తించారు..

● దొంగ హామీలను నమ్మి బీఆర్ఎస్‌ను ఓడించారు.. ● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

రాంనగర్, మార్చి 19: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి తప్పు చేశామని రాష్ట్ర ప్రజలు గుర్తించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఇప్పటి వరకు కేవలం రెండు హామీలు మాత్రమే అమలు చేశారని ఆయన చెప్పారు. రేవంత్‌రెడ్డికి మాయమాటలు చెప్పడం మొదటి నుంచి అలవాటేనన్నారు. అవినీతి చేసిన నేతలు ఆస్తులు కాపాడుకు నేందుకు పార్టీ మారుతున్నారని ఆయన ధ్వజ మెత్తారు. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎర్రబెల్లి పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ భాస్కర్ మాట్లాడుతూ.. స్వలాభం కోసం నేతలు పార్టీ మారుతున్నారని ఆరోపిం చారు. శ్రేణులు వారివెంట వెళ్లడం లేదన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేదీ లేదని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఉందన్నారు. ఎవరో కొందరు పార్టీ వీడినంత మాత్రాన జరిగే నష్టం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామన్నారు. కార్యకర్తలు ఆందోళనకు గురికావద్దని సూచించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజ్, వాసుదేవ రెడ్డి, లలితాయాదవ్, కడియం కావ్య, ఇండ్ల నాగేశ్వర్‌రావు, చింతల యాదగిరి వర్ధన్నపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాగా, ఈ సందర్భంగా పలువురు వర్ధన్నపేట బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. పదేళ్ల పదవులు అనుభవించి, ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీ వీడటం ఎంతవరకు సమంజసమని అరూరి రమేశ్‌ను ఉద్దేశించి అన్నారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచి తన స్వలాభం చూసుకున్నాడని విమర్శించారు. పార్టీ మారిన వారితో నష్టం లేదని, భవిష్యత్‌లో కలిసికట్టుగా పనిచేసి వర్ధన్నపేటలో బీఆర్ఎస్‌ను పటిష్టం చేస్తామని వారు పేర్కొన్నారు.

లాసెట్ ద్వారా ఎంజేపీ లా కళాశాలల్లో ప్రవేశాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో నెలకొల్పిన రెండు లా కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న లా సెట్ ర్యాంకు ద్వారానే సీట్లు కేటాయించనున్నట్లు ఎంజేపీ ఆర్సీవో మనోహర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మహేశ్వరంలో బాలుర రెసిడెన్షియల్ లా కళాశాల, కాజీపేటలో నెలకొల్పిన బాలికల రెసిడెన్షియల్ లా కళాశాలలో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు కళాశాలల్లో 5 ఏళ్ల లా కోర్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇంటర్ పాసై లా సెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా సీట్లు పొందవచ్చునని తెలిపారు. కాగా, లాసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఉందని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు సుధాకర్ (ఫైల్)

వేలేరు(ధర్మసాగర్)మార్చి 19: వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చ లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ.హరిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీచర గ్రామానికి చెందిన పిట్ల సుధాకర్(43) తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో కొన్నేళ్ల నుంచి మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తున్నాడు. వ్యవసాయ బావిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రూ.10లక్షలు అప్పులు చేసి బావిలో సైడ్‌బోర్లను సైతం వేయించాడు. దీంతో పాటు అప్పులు చేసి తన కూతురు రవళి వివాహం చేశా డు. వ్యవసాయంతో చేసిన అప్పులు తీర్చాలనుకున్నప్పటికీ సాగు చేసిన పంటకు సాగు నీరు లేకపోవడంతో దిగుబడి రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చడం ఎలా అని మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్దకు సోమవారం రాత్రి వెళ్లి సుధాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సుధాకర్‌ను చుట్టు పక్కల రైతుల గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చే సరికే సుధాకర్ మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు విచ్చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కూతురు, కుమారుడు ఉన్నాడు.

పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్లు కనిపిస్తే చర్యలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు కనిపిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని డీఈవో డాక్టర్ అబ్దుల్ హై మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మంగళవారం ఉదయం పరీక్షకు ముందు నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో పరీక్షా కేంద్రాల నిర్వాహకులు సీఎస్, డీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ఇతరత్రా నిర్వాహకులు సెల్‌ఫోన్లను పరీక్షాకేంద్రంలోకి తీసుకెళ్లరాదని ఆయన స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలు, హెడ్మాస్టర్ల గదులు, బాత్‌రూమ్‌లలో ఎక్కడా సెల్‌ఫోన్‌లు లేకుండా చూడాలని సెట్ కాన్ఫరెన్స్‌లో స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఆయన ప్రకటనలో హెచ్చరించారు. హనుమకొండ జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా సెల్‌ఫోన్లు వినియోగించినట్లు తన దృష్టికి రాలేదని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

● మేడారం విధులు ముగించుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదం ● 20రోజులుగా మృత్యువుతో పోరాటం



దేవానంద్(ఫైల్)



మృతుడి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బొట్ల దేవానంద్ (40) అనే పారిశుధ్య కార్మికుడు మంగళవారం మృతిచెందాడు. 20 రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన బొట్ల దేవానంద్ 20 యేళ్లుగా నగర పాలక సంస్థలో శానిటేషన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల సునిల్ పరిధిలో పని చేస్తున్నాడు. కాగా, మునిసిపల్ అధికారుల ఆదేశాల మేరకు ఫిబ్రవరి 15 నుంచి 29 వరకు మేడారం జాతరలో విధులు నిర్వర్తించాడు. జాతర విధులు ముగించుకుని 29న సాయంత్రంస్వచ్ఛభారత్ ఆటోను నడుపుకుంటూ నగరానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ములుగు జిల్లా గట్టమ్మ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీ దేవానంద్ ఆటోను ఢీకొట్టి వెళ్లిపోయింది. దేవా నంద్ కాళ్లు విరిగి కడుపులో బలమైనగాయాలయ్యాయి. అక్కడి వారు గుర్తించి 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించారు. దీంతో హైదరా బాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా వైద్యానికి శరీరం సహకరించకపోవడంతో మంగళవారం మృతి చెందాడు. దేవానంద్ చికిత్సకు ఇప్పటివరకు రూ.10లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుటుంబానికి ఏ అధికారులు, ఏ సంఘం నాయ కులు సహకరించలేదని, ఆర్థికంగా చితికిపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతునికి కుటుంబం కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల నియామకానికి కసరత్తు

మంత్రుల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

హనుమకొండ టౌన్, మార్చి19: బీఆర్ఎస్ హయాంలో నియామకమైన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లను కాంగ్రెస్ ప్రభుత్వం తొలిగించింది. ఇప్పుడు కొత్త (ఫైనాన్స్, ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్, హెచ్ఆర్ అండ్ ఐఆర్) డైరెక్టర్లను నియమించేందుకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో డైరెక్టర్లుగా పనిచేసేందుకు ఎన్పీడీసీఎల్‌తో పాటు, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కోలో పని చేస్తున్న చాలామంది సీఈలతో పాటు రిటైర్డ్ సీఈలు ఈనెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వీసులో ఉన్నవారైతే ఎస్ఈ, సీఈగా కలిపి ఐదేళ్లు, మొత్తంగా 15 ఏళ్ల సర్వీసు పూర్తయి ఉండాలని, రిటైర్డ్ అధికారులైతే 62 ఏళ్లు దాటకూడదని షరతు విధించింది. ఈ నిబంధనల ప్రకారం ఒక్కో డైరెక్టర్ పోస్టుకు 10 నుంచి 15 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. సీఎండీ అధ్యక్షతన ఏర్పాటయ్యే ప్రత్యేక కమిటీ ఇంటర్వ్యూ ఆధారంగా ఒక్కొక్క డైరెక్టర్ పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేస్తారు. వీరి పేర్లను సీల్డ్‌కవర్‌లో సంబంధిత మంత్రితో పాటు సీఎం దృష్టికి పంపిస్తే ముగ్గురిలో ఒక్కరిని ఖరారు చేసి ఎన్పీడీసీఎల్‌కు సమాచారం ఇస్తారు. కంపెనీ డైరెక్టర్ పేరును ప్రకటించి ఆఫర్ లేఖను మంజూరు చేస్తుందని ఎన్పీడీసీఎల్ సీనియర్ అధికారులు చెబుతున్నారు.

కాగా, డైరెక్టర్ పోస్టులను చేజిక్కించుకునేందుకు ఇప్పటికే పలువురు పావులు కదుపుతున్నారు. సంబంధిత మంత్రిని ప్రసన్నం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలతో పాటు సన్నిహితులతో పైరవీలు చేస్తున్నారు. ఇదిలా వుండగా, ఎలక్షన్ కోడ్ రాకముందే నోటిఫికేషన్ జారీ, దరఖాస్తుల ప్రక్రియ ముగిసినందున నియామకాలకు ఎలాంటి అడ్డంకి రాదని పలువురు అభిప్రాయ పడుతు న్నారు. ఒక వేళ అడ్డంకిగా మారితే నియామకానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

ఎమ్మెల్యేకు ముదిరాజ్‌ల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ముదిరాజ్ నేతలు

భూపాలపల్లిటౌన్, మార్చి 19: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణను ముదిరాజ్ కుల సంఘం నాయకులు మంగళవారం కలిశారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ముదిరాజ్ కులస్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జోరుక సదయ్య మాట్లాడుతూ స్టేట్ ఫిషర్‌మెన్ చైర్మన్‌గా నియమించాలని ముదిరాజ్‌లనే కేటాయించాలని కోరారు. ముదిరాజ్ భవనం కోసం 30గుంటల స్థలం కేటాయిం చాలన్నారు. నామినేటడ్ పోస్టుల్లో తమకు అవకాశం కల్పించాలన్నారు. తెగిపోయిన చెరువులు, కుంటల పన్ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల రాజ మౌళి, మహిళా అధ్యక్షురాలు పుష్పలత, నాయకులు మల్లయ్య, కిష్ట స్వామి, గట్ట య్య, రమేష్, వెంకటేశ్వర్లు, మొగిలయ్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రెడ్డిగాండ్ల నేతలు

భూపాలపల్లిటౌన్, మార్చి 19: ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డిని నియమించడ ంపట్ల హర్షం వ్యక్తంచేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖామంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయ ణరావు చిత్రపటాలకు రెడ్డిగాండ్ల సంఘం నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు అయిత కర్ణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుల సంఘం నాయకుడికి కాంగ్రెస్ ప్రాధాన్యం ఇవ్వడంపట్ల కృతజ్ఞతలు తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, సంతోష్ పోషిరెడ్డి, తిరుపతిరెడ్డి, సమ్మిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, పద్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



ఉప్పలయ్య మృతదేహం

రాయపర్తి, మార్చి 19 : గుర్తు తెలియని లారీ ఢీకొని వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని మైలారంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మైలారం గ్రామంలో నిర్వహిస్తున్న బోనాల పండుగకు తన బంధువైన శివరాత్రి సుధాకర్ ఇంటికి ములుగు జిల్లా జాకారం ప్రాంతానికి చెందిన వల్లెపు ఉప్పలయ్య(70) వచ్చాడు. సోమవారం రాత్రి గ్రామంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. దీంతో ఉప్పలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కూతురు వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షం.. రైతుల్లో ఆందోళన

ములుగు, మార్చి 19: ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం చిరు జల్లులు కురిశాయి. ములుగు, వెంకటాపూర్(రామప్ప) మండలాల్లో కొద్దిసేపు మోస్తరు వాన పడింది. తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల్లో జల్లులు పడ్డాయి. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. ఈక్రమంలో మిర్చి రైతుల్లో ఆందోళన నెలకొంది. రాబోయే ఒకట్రెండు రోజుల్లో వర్షసూచన ఉండటంతో నష్టం కలుగుతుందని వేదన చెందుతున్నారు.

మిర్చి తడుస్తుందనే కలవరం

వాజేడు: మూడు రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా ఆకాశంలో మబ్బులు కమ్ముకొని ఉండగా రాత్రిపూట తేలిక పాటి చిరుజల్లులు పడేవి. కాగా మంగళవారం సాయంత్రం మోస్తరు వర్షం కురవడంతో రైతన్నల్లో కలవరం మొదలైంది. ఇప్పటికే కల్లాల్లో ఆరబోసిన మిర్చిని కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమించారు. పంటపై టార్పాలీన్లు, బరకాలు కప్పి మిర్చిని కాపాడుకునే ప్రయత్నం చేశారు. అసలే దిగుబడులు లేక దిగాలు చెందుతున్న రైతులకు అకాల వర్షంతో తీవ్రంగా నష్టాలు వచ్చే ఆస్కారం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మార్కెట్‌లో మిర్చికి ధర కూడా అంతంత మాత్రమే ఉండగా ఇప్పుడు కురిసే వర్షాలు మరింత నష్టం చేకూర్చే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.



వాజేడు మండలంలో మిర్చి రాశులపై బరకాలు కప్పిన రైతులు

పంట రంగు మారుతుందని..

మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్లతోపాటు పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు వాన పడింది. దీంతో మిర్చి రైతులు పంటను కాపాడుకొనే ప్రయత్నం చేశారు. వర్షం వల్ల మిర్చి రంగు మారే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకే ఈతలో రెండు లేగదూడలు



ఆవుతో రెండు లేగదూడలు

కాటారం, మార్చి 19: పశువులు ఒక ఈతలో ఒకే దూడకు జన్మనివ్వడం సహజం. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో అందుకు భిన్నంగా ఓ ఆవు రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. గుండ్రా త్‌పల్లి గ్రామపంచాయతీ పరిధి మల్లారం గ్రామా నికి చెందిన దుర్గం ధర్మ య్య అనే రైతుకు చెందిన ఆవు మంగళవారం రెండు లేగదూడలకు జన్మని వ్వడం ఆశ్చర్యానికి గురిచేసింది. దీంతో గ్రామస్థులు లేగదూడలను చూడ్డానికి ధర్మయ్య ఇంటి వద్ద బారులు తీరుతున్నారు. వెటర్నరీ వైద్యులు రాకేష్, అభిషేక్ ఈ విషయంపై మాట్లాడుతూ ఇలా జరుగగడం అరుదైన విషయమని తెలిపారు. లక్షల్లో ఒక దానికి జన్యుపరివర్తనలో భాగంగా రెండు దూడలను జన్మనిస్తాయని పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థుల డీబార్

గణపురం, మార్చి 19: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పరీక్ష రాస్తున్న నలుగురు విద్యా ర్థులు డీబార్ అయ్యారు. మంగళవారం హిందీ పరీక్ష రాస్తుండగా వారు మాస్ కాపీ యింగ్‌కు పాల్పడినట్టు స్క్వాడ్ అధికారులు శ్రీనివాస్, దేవానాయక్ గుర్తించారని సూపరిం టెండెంట్ సుధాకర్ తెలిపారు. మాస్ కాపీ యింగ్‌కు పాల్పడిన ముగ్గురు బాలురు, ఒక బాలికను డీబార్ చేసినట్టు వెల్లడించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఇన్విజిలేటర్లను ఆ విధుల నుంచి తొలగించామని తెలిపారు.

కల్వర్టును ఢీకొన్న బైక్

పదో తరగతి విద్యార్థినికి తీవ్రగాయాలు

పరీక్ష రాయడానికి వెళ్తుండగా ప్రమాదం



ధ్వంసమైన బైక్



గాయపడ్డ విద్యార్థిని అక్షయ

కాటారం, మా ర్చి 19: బైక్ అదు పు తప్పి పదో త రగతి విద్యార్థినికి తీవ్రగాయాల య్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన భూపా లపల్లి జిల్లా కాటా రం మండల శివా రు 353(సీ) జాతీ య రహదారిపై బయ్యారం స్టేజీ సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని తోటపెల్లి అక్షయ తన సోదరులు రాజేష్, తరుణ్‌తో కలిసి ఒకే బైక్‌పై పరీక్ష కేంద్రానికి బయల్దేరింది. రాజేష్ బైక్‌ను నడుపుతుండగా బయ్యారం, మద్దు లపల్లి మధ్యలో అది అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో ముందు టైర్ ఊడిపోయి బైక్ ధ్వంసమైంది. వాహనంపై వెనక కూర్చొన్న అక్షయ రోడ్డుపై ఎగిరిపడింది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. రాజేష్, తరుణ్ స్వల్పం గా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా భూపాలపల్లి ఆస్ప త్రికి తరలించారు. తలకు అంతర్గతంగా బలమైన దెబ్బ తాకడంతో అక్షయ అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమెను వంద పడకల ఆస్పత్రి వైద్యులు సూప ర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్షయ పరిస్థితి విషమంగానే ఉందని తెలిసింది. ఈ ప్రమాదంతో ఆమె పదో తరగతి పరీక్షలు రాయలేని స్థితికి చేరుకుందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

విచారణ చేపట్టకుండా చర్యలు తగవు

సింగరేణి జీఎంకు అధికారుల సంఘం నేతల వినతి



జీఎం శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న అధికారుల సంఘం నేతలు

కాకతీయఖని, మార్చి 19: మందమర్రి ఏరియాలో ఇటీవల జరిగిన ప్రమాదంపై ఎలాంటి విచారణ చేపట్టకుండా చర్యలు తీసుకోవడం సరికాదని సింగరేణి అధికారుల సంఘం భూపాలపల్లి ఏరియా అధ్యక్షుడు వెంకట్రామి రెడ్డి అన్నారు. స్థానిక జీఎం శ్రీనివా సరావుకు ఆ సంఘం నాయకులు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కాశీపేట గనిలో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్ కర్రె రాజు ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమన్నారు. అందుకు బాధ్యుడిని చేస్తూ ఏరియా స్టోర్స్ ఇన్‌చార్జ్ వైదేశ్వర్‌కు చార్జ్‌షీట్ ఇవ్వడం దారుణమన్నారు. ప్రమాదంపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, కార్యదర్శి రమేష్, సంయుక్త కార్యదర్శి రాజగోపాల్, కవీంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీ-3 పీవోగా భిక్షమయ్య

గణపురం, మార్చి 19: భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని ఓపెన్ కాస్టు-3 ప్రాజెక్టు అధికారిగా వాసం భిక్ష మయ్యను నియమించారు. మంగళ వారం ఆయన ప్రాజెక్టు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన వెంకటేశ్వర్లు రామగుండం ఆర్జీ-2కు బదిలీ అయ్యారు. దీంతో ఏరియాలోని ఓసీ-2 మేనేజర్‌గా పనిచేస్తున్న భిక్షమయ్య పదోన్నతికి కల్పించి పీవోగా ఓసీ-3కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఓసీ-3 అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మైనింగ్ స్టాఫ్ కృష్ణమూర్తి, సదయ్య, సుదర్శన్, శ్రీనివాస్, నరేందర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడిచర్లలో జెట్ విమానం చక్కర్లు

మల్హర్, మార్చి 19 : మండల కేంద్రమైన తాడిచర్లలో జెట్ విమానం ఆకాశాన చక్కర్లు కొట్టింది. మూడు రోజుల నుంచి ఇది గ్రామంలో విహంగ విహారం చేస్తోందని గ్రామస్థులు తెలిపారు. మంగళవారం మధ్యాహ్న సమయంలో తక్కువ ఎత్తు నుంచి విమానం వెళ్లడంతో ఆ శబ్దానికి అందరూ ఇళ్లల నుంచి బయటకు వచ్చి ఆసక్తిగా తిలకించారు. మానేరు మీదుగా ఓసీ వైపు వెళ్లి తిరిగి వెళ్లిపోయినట్టు గ్రామస్థులు తెలిపారు. దీని దృశ్యాలను పలువురు ఫోన్లలో చిత్రీకరించారు. ఈ విమానం ఎందుకు వచ్చిందనే విషయంపై పోలీసు, రెవెన్యూ అధికారులను ఆరా తీయగా తమకు సమాచారం లేదని తెలిపారు. ఇది సింగరేణి అధికారులకు సంబంధించిన విమానమని ప్రచారం సాగుతోంది.

ఏడుగురి బైండోవర్

గోవిందరావుపేట, మార్చి 19: వన్యప్రాణుల వేట కోసం కరెంటు తీగలు అమరుస్తున్న మండలంలోని ప్రాజెక్టునగర్, చల్వాయి, దుంపెల్లిగూడెం గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులను మంగళవారం స్థానిక తహసీల్దార్ సృజన్‌కుమార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేసినట్లు పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. బైండోవర్ అయిన వారిలో వాసం శివాజీ, జక్కు శంకర్, జక్కు రాజు(ప్రాజెక్టునగర్), తల్లడి సోమయ్య, చెరుకుల వెంకటేశ్వర్లు(చల్వాయి), పన్నాల అభిలాష్, ఎర్రబోయిన కొమురయ్య(దుంపెల్లిగూడెం) ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసు దాడులు

వాజేడు, మార్చి 19: గుడుంబాను తయారు చేస్తున్న స్థావరాలపై వాజేడు పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎస్సై చవళ్ల వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మురుమూరు అటవీ ప్రాంతంలో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు అటవీ ప్రాంతంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులను చూసిన కొంత మంది వ్యక్తులు నాటుసారాతో పారిపోవడానికి ప్రయత్నించగా వారిని పట్టుకున్నారు. భూమిలో పాతిపెట్టిన బెల్లం పానకం డ్రమ్ములను గ్రామ యువత సాయంతో ధ్వంసం చేశారు. అదే గ్రామానికి చెందిన తెల్లం హరీశ్, చింత సమ్మయ్య, తాటి శుక్రమ్, నక్కా చంద్రశేఖర్, తెల్లం లక్ష్మయ్య, కుర్సం శ్రీనుపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరి వద్ద నుంచి 42 లీటర్ల నాటుసారా, 4,100 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు.

మహిళపై కేసు నమోదు

గోవిందరావుపేట : గుడుంబా తరలిస్తున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. గ్రామంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చౌరస్తాలో రాంనగర్ గ్రామానికి చెందిన జర్పుల కవిత అనుమానాస్పదంగా కనిపించిందని అన్నారు. దీంతో సిబ్బంది అమెను అదుపులోకి తీసుకుని చేతిలో ఉన్న బ్యాగును తనిఖీ చేయగా 10లీటర్ల గుడుంబా లభ్యమైందని పేర్కొన్నారు. దీంతో కవితపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

తాడ్వాయి, మార్చి 19: గ్రామాల్లోని ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని కొశెట్టివాయి, భూపతిపూర్, ఇప్పలగడ్డ గొత్తికోయ గ్రామాలను తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలను సమావేశపరిచి మాట్లాడారు. గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని, మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని సూచించారు. అనంతరం గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాటాపూర్ క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేశారు. మండల కేంద్రంలో జరుగుతున్న పదోతరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు.

చిరు ధాన్యాలపై అవగాహన

ములుగు కలెక్టరేట్, మార్చి 19: పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా ములుగులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రాముఖ్యంపై సీడీపీవో స్వాతి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా ఐరన్ పుష్కలంగా లభిస్తుందని అన్నారు. దీంతో రక్తహీనతకు చెక్ పెట్టొచ్చన్నారు. గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు తరచూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, అరుణ, సరస్వతి, రాణి తదితరులు పాల్గొన్నారు.

కారు ఓనర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ప్రవీణ్



ములుగు కలెక్టరేట్, మార్చి 19: సమ్మక్క, సారక్క కారు ఓనర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా బాదం ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ములుగులో మంగళవారం యూనియన్ సమావేశం జిల్లా అధ్యక్షుడు మేకల సంజీవ ఆధ్వర్యంలో జరిగింది. నాయకులు బొమ్మగాని భాస్కర్, లోకు రాజేష్, ఉప్పుల రాజు, మాట్ల బద్రి, అఫ్రోజ్‌ఖాన్, గుగ్గిళ్ల సృజన్, బోగం కుమారస్వామి, బండ సురేష్, రమేష్, కోమల్‌రెడ్డి, అజ్మీరా రామ్‌సింగ్, కిషోర్, రాజేందర్, నన్నెబోయిన రాజేందర్, పొటిశెట్టి రాజేందర్, శ్రావణ్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేసిన రెండో ఏఎన్ఎంలు

వెంకటాపూర్(రామప్ప), మార్చి 19: మూడు నెలల పెండింగ్ వేతనాలు, పీఆర్సీ బకాయిలు అందించాలని, లేనట్లయితే ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని పేర్కొంటూ రెండో ఏఎన్ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ రిషితకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. రెండో ఏఎన్ఎంలు వజ్ర, సులోచన, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన

కాటారం, మార్చి 19: కాటారం రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు అవగాహన కల్పించారు. వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మెలకువలు, ఆయిల్‌పామ్ సాగు, వేసవిలో కూరగాయల సస్యరక్షణ, పురుగు మందుల వాడకం తదితర అంశాలను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల ఏవోలు, ఏఈవోలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం

మల్హర్, మార్చి 19 : తాడిచర్ల ఓసీపీలో బొగ్గు నిక్షేపాలు వెలికితీస్తున్న ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో మల్లారంలోని కేజీబీవీ, పెద్దతూండ్ల హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యాన్ని మంగళవారం ప్రారంభించారు. పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

సింగరేణి డైరెక్టర్ (పా) శ్రీనివాస్

కాకతీయఖని, మార్చి 19: ఏరియాలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.వి.కె.శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కోర్టు కేసులను సకాలంలో పరిష్కరించి స్టాండింగ్ కౌన్సిలింగ్‌కు అందజేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

అడిషనల్ ఆర్‌డీవో వసుమతి

గణపురం, మార్చి 19: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీవో వసుమతి అన్నారు. మండలంలోని బస్వరాజుపల్లి గ్రామ శివారులో ఉన్న చెరువు వద్ద ఉపాధిహామీ పనులను ఆమె మంగళ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పని ప్రదేశంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కూలీలకు పని కల్పించే విధంగా రెండు సార్లు ఫొటో తీసినప్పుడే వారికి డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డును బ్యాంక్ ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. గ్రౌండ్ వాటర్ పెరుగుదలకు పాంపడ్ చెరువులతోపాటు చేలల్లో గట్లపై చెట్లను పెంచాలన్నారు. ఆమె వెంట టీఏ నవ్య, పంచాయితీ కార్యదర్శి రాజు, సీనియర్ మేట్ సంతోష్ తదితరులు ఉన్నారు.



కూలీలతో మాడుతున్న అడిషనల్ డీఆర్‌డీవో వసుమతి

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



వాజేడులో ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహిస్తున్న పోలీసులు

వాజేడు, మార్చి 19: మండల కేంద్రంలో పోలీసులు మంగళవారం ఫ్లాగ్ మార్చ్ చేశారు. వెంకటాపురం సర్కిల్ సీఐ బండారి కుమార్ నేతృత్వంలోని సివిల్, సీఆర్పీఎఫ్ బలగాలు పుర వీధుల్లో తిరుగుతూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ సెంటర్‌లో సీఐ కుమార్ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. శాంతియుత వాతావరణం ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు. ప్రజలు ఎవరూ భయపడొద్దని ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితి గల నాయకులను ఎన్నుకునే అవకాశం ప్రజలకు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, ఏఎస్సై లతీఫ్, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

టేకుమట్ల, మార్చి 19: కడుపునొప్పి భరించలేక పురుగుల మందుతాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఏంపేడులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై జి. ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అడ్డూరి కార్తీక్(23) ఏడాది కాలంగా కడుపనొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలుమార్లు వైద్యం చేయిం చినా తగ్గలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది కార్తీక్ ఆ నెల 12 ఇంట్లో ఎవరూ లేని సమ యంలో పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని జమ్మికుంట ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హనుమకొండలోని కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

చికిత్స అందుతున్న క్రమంలో కార్తీక్ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాం త వాతావరణంలో జరగాలని, ఘర్షణలకు పాల్పడితే చట్టప రంగా కఠినచర్యలు తప్పవని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి హెచ్చ రించారు. కాటారం పోలీస్ స్టేషన్ ఆవరణలో సబ్‌డివిజన్ పరిధిలోని పలు రకాల క్రిమినల్ కేసులున్న వారికి మంగళవారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లా డుతూ ఎన్నికల సందర్భంగా కేసుల్లో ఉన్నవారికి జీవితాంతం వాటిని మోయాల్సి ఉంటుందన్నారు. అనవసర తప్పిదాలతో ఇబ్బందులపాలు కావద్దని హితవు పలికారు. పోలీసులు ప్రతి ఒక్కరిపైనా ప్రత్యేక నిఘా ఉంచుతారనే విషయాన్ని గుర్తుంచుకుని మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం సీఐ ఈపూరి నాగార్జునరావు, కాటారం, మహాముత్తారం, కొయ్యూరు, మహదేవపూర్ ఎస్సైలు అభినవ్, మహేందర్, నరేష్, ప్రసాద్ కాటారం ఎస్సై-2 హరిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి : చిట్యాల సీఐ

చిట్యాల: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ మల్లేష్ అన్నారు. చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాల పరిధిలో రౌడీ షీటర్లుగా కేసు నమోదైన వారికి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన కౌన్సెలింగ్ చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నిక నేపథ్యంలో రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సైలు షాఖాన్, అశోక్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కుడు పోశమ్మ జాతర ప్రారంభం



నాగులమ్మ- ముక్కుడు పోశమ్మ గద్దెల వద్ద పూజలు

మంగపేట, మార్చి 19: మండలంలోని కోమటిపల్లి శివారు అడవిలో వెలిసియున్న శ్రీ నాగులమ్మ- ముక్కుడు పోశమ్మ, సారలమ్మ దేవతల జాతర మంగళవారం సాయంత్రం ప్రారంభమైంది. ప్రధాన పూజారి కాయం బాయమ్మ, ఆధ్వర్యంలో ఉప పూజారులు వట్టం రాజకుమారి, వట్టం సాంబశివరావు, పొదెం సమ్మక్క ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గౌరారం వాగు ఒడ్డు నుంచి కంకవనాన్ని (మండె మెలుగు) సన్నాయి, వాయిద్యాల మధ్య కార్యక్రమాలను ఆలయ ప్రాంగణంలో అధిరోహిం చారు. మొదటి రోజు కొమటిపల్లి, తోండ్యాల లక్ష్మీపురానికి చెందిన భక్తులు హాజరై పూజ ఇత్యాదికార్యక్రమాలను నిర్వహించారు. మూడు రోజుల పాటు ఈ జాతర జరగనుంది.